International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.5, Issue-2, February, 2018
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# శాస్త్ర సాంకేతిక భాషగా తెలుగు

బయ్య కాశయ్య
ఎం.ఏ., ఎం.సి.జె, బి.ఇడి,నెట్, సెట్

ప్రజలూ పండితులూ పాలకులూ తెలుగువారే. అయినా వారందరు ఒకటి కాదు. వారిది ఒక సామాజిక వర్గం అసలే కాదు. వారు ఏ కోశానా ఒక రీతి జీవనం గడపరు. అంతా ఒకేలా ఆలోచించరు. వారివి వేరు వేరు సంస్కృతులు. వేరు వేరు భాషలు. శ్రమజీవులూ, శ్రమ సంస్కృతికి దూరమైన సంపన్నులూ ఒకటి కాదు. అలాగే వారి భాషలో కూడా తేడాలు ఉంటాయి. భాషా ప్రయోజనం, భాషా వ్యవహారం కూడా భిన్నమైనవే.

ఐతే జాతి, సంస్కృతి, మతం, కులం వంటి కొన్ని అంశాలు కలుస్తాయి. కొంత పరస్పర భావన ఉంటుంది. ఇక్కడ మాత్రమే వాళ్ళు ఒకటిగా కనుపిస్తారు. భాషలో తేడాలను మరచి తత్కాలం సంభాషిస్తారు. అక్కడ కూడా ఎవరి భాష, ఉచ్చారణ, వ్యక్తీకరణ వారిదే. ఐతే దీనికి కారణం ఏమిటి? మన సమాజంలో కనుపించే వివిధ అంతస్థులు, స్థాయీ భేదాలే అని చెప్పాలి. ఈ భేదాలు సమసిపోయినప్పుడు ఒకే భాష వ్యవహారంలోకి రావడానికి ఆస్కారం ఏర్పడుతుంది. అట్లని వృత్తి, కుల, ప్రాంతీయ మాండలికాలు సమసిపోతాయని అర్థం కాదు. వాటి అస్థిత్వానికి సామాజిక, సాంస్కృతిక, మతపరమైన మూలాలు ఉంటాయి. ఈ తేడాలు అన్ని భాషల్లోనూ ఉంటాయి. భాషా వైరుధ్యాలు అధిపత్య స్థాయిని అధిగమించడానికి కృషి జరగటం తప్పుకాదు. అది నేటి అవసరం.

దేశీయంగా ఉన్న భూస్వామ్య భావజాలం తెలుగుభాషపై సంస్కృత భాషా ప్రభావాన్ని ఆధిపత్యాన్ని అంగీకరిస్తుంది. గుడి, బడి, మతం, కర్మకాండలు, సాహిత్యం వంటివి యథాతథ సంస్కృత పదజాలాన్ని సమ్మతిస్తాయి. చదువుకున్న పెత్తందారీ భావజాలం ఆంగ్ల విద్యాబోధనని, ఆంగ్లభాషా సార్వభౌమాధికారాన్ని నిలపాలని చూస్తుంది. పెట్టుబడిదారీ సంస్కృతి, టీవీ చానెళ్ళు, సాంకేతికరంగం (కంప్యూటర్ మొ॥7) క్రీడారంగం (క్రికెట్మొ॥), వాణిజ్యరంగం (షేర్ మార్కెట్), న్యాయవిభాగం వంటి రంగాలలోంచి ఆంగ్ల పదజాలం కుప్పలు తెప్పలుగా వచ్చి చేరిపోతున్నది. దీనికి తోడు ప్రపంచీకరణ ఒకటి పాలకవర్గాలను, ప్రభుత్వాలను లోబరుచుకుని తన ఆధీనంలో ఉంచుకుంటున్నది. భారతదేశంలోని భూస్వామ్యం, పెట్టుబడిదారీ సంస్కృతి మధ్య తమ వైరుధ్యాలను కొనసాగిస్తూనే మతం, భాష, సినిమా, టీవీ ప్రసార ప్రచారమాధ్యమాలు, సాంస్కృతిక ఆధునికత, పాతరకం నీతినియమాల సంస్కృతి ప్రజల అవగాహనకు వస్తున్నాయి. వీణ, సితార్ వంటి వాద్యాలు గిటార్ తంత్రీ మోతలకు పరవశించి పక్కవాద్యాలుగా దాసోహం అవుతుంటాయి. ఈ దేశంలో సైఫీసాహిత్యం (సైన్స్ ఫిక్షన్) దేవం, అమూర్తశక్తులు ప్రాబల్య ప్రతిబింబంగా మారుతోంది. కంప్యూటర్ భౌతిక జ్ఞానం కూడా కొబ్బరికాయ విశ్వాసం ముందు వెలవెలపోతుంది.

ఎవరి నమ్మకాలు, విశ్వాసాలు వారివి. వాటిని గౌరవిస్తాం. ఎవరూ కాదనరు. కాని కంప్యూటర్ విజ్ఞానం మనకి ఆంగ్లభాషని, పదాలని సరపరా చేస్తుంది. పైకి కనిపించే విశ్వాసాలు సంస్కృత పదాలలో మాత్రమే నిక్షిప్తమై ఉంటాయి. మనం ఈ ఆధునిక భాషా సందర్భాన్ని గుర్తించాలి. భాష – భావజాలాల ద్వారా మాత్రమే వ్యక్తమవుతుంది. భాషా దృక్పథం కూడా ఒక భావజాలమే. భావం – తనకు అనువైన, పవిత్రమైన, గొప్పవైన విషయాల పట్ల ఆకర్షితమవుతుంది. ఈ సమాజంలో గొప్ప భాషలంటే పాలకుల భాషలే. విజేతల భాషలే. అది ఉరుదూ కావచ్చు. సంస్కృతాంగ్లాలు కావచ్చు; తెలుగు ప్రజల నోళ్ళల్లో సజీవంగా ఉన్న అచ్చ తెలుగు, జాను తెలుగు, దేశీ తెలుగుభాష మాత్రం కాదు. దానిని ఎంత మాత్రం సమ్మతించని రక్తం మనలో పారుతున్నది. దాని పేరుతో ఇతర భాషలను నెత్తికెక్కించుకోవడానికైనా మన మేధావులు వెనుకంజ వేయరు.

వెయ్యేళ్ళ నుండి వివిధ కారణాలతో పరభాషలను స్వభాషకి అడ్డిఅడ్డి దాని అసలు రూపాన్ని 'పాడు' చేశాం. ఎన్నో కారణాలు చూపి భాష సరిపోవడం లేదనే తప్పుడు కారణంతో ఇతర భాషలను స్వాగతిస్తున్నాం. అదే వారసత్వం, అదే ఆలోచన ఇవ్వాళ కూడా కొనసాగుతూ వస్తున్నది. తెలుగుభాష పరిధి చిన్నది. శాస్త్రభాషగా పనికి రాదు; పరభాష దిగుమతి చేసుకోవాల్సిందేననే శిష్టవర్గం దబాయిస్తున్నది.

ఇక్కడే భాషోద్యమ వాదులకూ, తెలుగు విశ్రాంతి వర్గం పెద్దలకూ వైరుధ్యం ఏర్పడింది. ప్రపంచంలోని ఏ భాష అయినా ఇతర భాషల నుండి పదాలను గ్రహిస్తుందనేది సహజం. మరి తెలుగులోకి ఈ పదాల సరఫరా గురించి ఎందుకు తర్జనభర్జన పడాలి?

నిజానికి ప్రస్తుతం ఏ అవసరాల రీత్యా పరభాషల పదాలు తెలుగులోకి తీసుకుంటారు? ఏ శాస్త్రాల గురించి రాస్తారు? రాసే శాస్త్రాంశాలు ఏమిటి? ఈ విషయాలను నిర్ధారించక ముందే తెలుగులో పదాలు, పరభాష లేదని చెప్పడం అశాస్త్రీయం కాదా? శాస్త్ర సాహిత్యం ఏదైనా అది సమాజం అవసరాల రీత్యా తప్పనిసరై తీసుకోవడం జరుగుతుంది. అంతేకాని భాషా అవసరాల కోసం తీసుకోం. ఆ శాస్త్ర విషయాలను ఆయా రంగాల నిపుణులు జీర్ణంచేసుకుని దానిని మరో భాషలో వ్యక్తం చేస్తారు. పూర్తిగా జీర్ణం కాకుండా కేవలం మక్కికిమక్కీ అనువాదం చేస్తే అజీర్తిపదాల వాంతి అవుతుంది. యాంత్రిక అనువాదం చేసేవారు ముందు పదాలు కావాలని అడుగుతారు. పరిభాష లేదని వగస్తారు. శాస్త్ర నిపుణులకి పరభాష మాత్రమే వస్తే తెలుగు భాషలో రాయడానికి కష్టపడతారు. ఆ కష్టం పదాలపై తోస్తారు. నిజమే. అందుకే అప్పుడు తెలుగుభాష పండితుల అవసరం గుర్తిస్తారు. నిజానికి తెలుగుభాష, సంస్కృత భాష పండితులు ఎవరు సహకరిస్తారో అతనికి తెలియాలి. సహజంగానే పేరుపొందిన సంస్కృతభాషా పండితులే ఉపద్రవం నుండి కాపాడుతారనే భావన వారిలో ఉంటుంది. దానివల్ల తెలుగు పేర సంస్కృతభాషా పదాలు వచ్చి చేరుతాయి. అలా ఆ పదాలకు అర్థాలు తెలుసుకోవడానికి విద్యార్థులు, పాఠకులు తిరిగి నిఘంటువులను జల్లెడ పట్టాలి. తెలుగులో అర్థం చేసుకోవడానికి చాలా కష్టపడాలి. విషయం అర్థం కావడానికి ఆంగ్లమూలం చదవాలి అని అనుకుంటారు. ఇది రెండు విధాల కష్టం తెచ్చే పద్ధతి. ఐతే

తెలుగు పదాలు ఉంటే వాటిని ఉపయోగించుకోవాలి. తెలుగు పదాలను ఉపయోగించినా అవి అర్థం అవుతాయా అని పండితులు సందేహిస్తారు.

ప్రతి భాషకు ఒక అప్రకటిత వ్యాకరణం ఉంటుంది. ఇది ఆయా పదాలకు, అర్థాన్ని, అర్థచ్ఛాయలను తెలియజేస్తుంది. ఇది ఉన్న ఊరిలో దారి వెదకడం లాంటిది. తెలియని ప్రాంతంలో చిరునామా వెదకడం కష్టమే కదా. తెలుగు పదాల అర్థం, ఉచ్చారణ, స్వభావం, సహజంగా తెలిసే అవకాశం ఇక్కడ అధికంగా ఉంటుంది. ఈ విషయం విద్యార్థి లేదా పాఠకుడి దృష్ట్యా ఆలోచించినప్పుడు అవగతం అవుతుంది.

ఒకవేళ తెలుగులో అలాంటి పదాలు సిద్ధంగా లేకుంటే తెలుగుభాషలోనే వెదికి, సరిచేసి, కల్పించి నిర్ణయం చేసుకోవడం సముచితం. ఈ ప్రయత్నం ఎక్కడా సమగ్రంగా జరగలేదు. జరిగి విఫలం అయ్యాం అనీ ఎవరూ ఉదాహరణగా పేర్కొనడం లేదు. అలాంటి ప్రయత్నాలు చేయకుండానే తెలుగుభాష సరిపోదు అని అలవోకగా అనడం బాధాకరం.

ఇక్కడే మరో ముఖ్యవిషయం ప్రస్తావించుకోవాలి, ప్రాచీన మధ్యయుగాలలో తెలుగువారు కోటలు కట్టారు. మహా నిర్మాణాలు చేశారు. విలక్షణ కట్టడాలను, ఆలయాలను నిర్మించారు. ఆధునిక కాలంలో తెలుగువాళ్ళే బొంబాయి, చెన్నపురి పట్టణాలలో గల గొప్ప భవంతులను నిర్మించారు. వీటికి రాళ్ళెత్తిన కూలీలు రాత్రింబవళ్ళు అజమాయిషీ చేసిన వారూ తెలుగువాళ్ళే. వీటి నక్షా (మ్యాపు)లు తీసినవారు తెలుగు ఇంజనీర్లే. మరి అంత వాస్తు, నిర్మాణ కౌశలాన్ని ఏ భాషలో వ్యక్తం చేశారు. అపురూప శిల్పాలను వాస్తురీత్యా చెక్కి ప్రపంచదేశాలను విస్మయపరిచారు కదా ఆ శ్రమజీవి శిల్పుల భాష తెలుగు కదా? వారు ఉపయోగించిన పారిభాషిక పదాలు తెలుగువి కాదా? గొప్ప నిర్మాణాలను ఒంటి చేత్తో నిర్మించిన ఆ తెలుగు నిపుణుల మేధస్సు ఈ నేల మీదే ఆవిర్భవించింది కదా. మరి ఆనాడు వాళ్ళు భాషా కోవిదులని ఆశ్రయించలేదు. అవసరాల రీత్యా తమ భాషలో పరిభాషని సృష్టించి వేలాది మందికి అర్థమయ్యే శాస్త్ర భాషని రూపొందించడం వల్లే ఆ కట్టడాలు నిర్మించగలిగారని తెలుసుకోవాలి.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. భాషా వరణం – జయధీర్ తిరుమలరావు
2. తెలుగు భాషా సమస్యలు – ప్రజాసాహితి.
3. పరిపాలన భాషగా తెలుగు – ప్రజాసాహితి.